క్లుప్తంగా

నేటినుంచి ఆధార్ సేవలు

ముద్దనూరు : మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నుంచి ప్రత్యేక ఆధార్ సేవలందుబాటులో వుంటాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముకుందరెడ్డి తెలిపారు. బాలల(చిన్న పిల్లలకు)కు ఆధార్ ధృవీకరణ పత్రాలు అందజేయుటకు ఈ కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. 26న పెనికలపాడు అంగన్వాన్‌వాడీ కేంద్రం, 27న యామవరం అంగన్‌వాడీ కేంద్రం, 28న ముద్దనూరు-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఆధార్‌సేవలు అందుతాయని, చిన్నపిల్లల జనన ధృవీకరణ పత్రం, తల్లి, తండ్రి వారి ఆధార్‌కార్డులతో పిల్లలతో ఆధార్ కేంద్రాల్లో హాజరై ఈ సేవలు పొందాలని ఎంపీడీవో తెలిపారు.

భూమి పూజ

ఎర్రగుంట్ల : మండలంలోని వై.కోడూరులో జువారి సిమెంట్ ఫ్యాక్టరీ వారి సహకారంతో ప్రాథమిక ఆరోగ్య చికిత్స కేంద్రంను నిర్మిస్తున్నట్లు జువారి సిమెంట్ ఫ్యాక్టరీ హెచ్‌ఆర్ సినియర్ జీఎం ఫణికుమార్ తెలిపారు. బుధవారం గ్రామంలోని గ్రామస్తులతో కలసి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జువారి సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం 2024-25 ఆర్థిక సంవత్సరం సీఎస్ఆర్ నిధులతో ప్రాథమిక ఆరోగ్య చికిత్స కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ శివనారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

చక్రాయపేట : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగనున్నట్లు ఎంపీడీవో రాజశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలోని సభా భవనంలో ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు

28న ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 28వ తేదీన ఎంపీడీఓ సభా భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ఎర్రగుంట్ల : మున్సిపల్ బడ్జెట్ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషఫణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

గొప్ప పరిపాలనాధ్యక్షుడు వాజ్‌పేయి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : మాజీ దేశ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను స్థానిక బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించా రు. బుధవారం మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అందరికీ పండ్లు పంపిణీ, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, అటాక్ నుండి కటక్ వరకు స్వర్ణచతుర్భుజి ఆకారంలో అతి పెద్ద జాతీయ రహదారులు నిర్మించారన్నారు.

రేపు వైద్య నిపుణుల రాక

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కమలాపురంలో హాజరైన భక్తులు

పులివెందుల టౌన్ : పట్టణంలో క్రిస్మస్ పండుగ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవ సోదరులు ఉదయాన్నే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చి, ఆర్‌సీఎం చర్చి, రాక్ చర్చి, బేతేలు చర్చిలతోపాటు పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాస్టర్లు యేసు క్రీస్తు వృత్తాంతాన్ని చదివి వినిపించారు. పండుగ పర్వదినం గురించి వివరించారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో సీఎస్ఐ చర్చి ఫాస్టర్, డివిజనల్ చైర్మన్ రెవ. సాల్మోన్ బాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఆర్‌సీఎం, నిస్సీ, టీసీసీ(తెలుగు చర్చ్ కౌన్సిల్), టీసీసీ టౌన్‌చర్చ్, రెహబోతు, మన్నా, హోసన్నా, షిలోహు, యెరూషలేము, షాలేము చర్చిలతోపాటు పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, గంగవరం, విభరాపురం, సంబటూరు, కోగటం, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, చదిపిరాళ్ల, రామచంద్రాపురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లోని ఫాస్టర్లు క్రీస్తు సందేశం అందించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు విశేషంగా అలరించాయి.

వేంపల్లెలో..

వేంపల్లె : మండల వ్యాప్తంగా క్రిస్మస్ పండుగ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక క్రిష్టియన్ కాలనీలో ఉన్న సీఎస్ఐ చర్చిలో ఫాస్టర్ స్టీఫెన్ పాల్, మదర్ థెరిస్సా చర్చిలో ఫాస్టర్ బాలస్వామి, బిద్దాలమిట్టలోని కల్వరికుంట క్రీస్తు సంఘం చర్చిలో ఫాస్టర్ రవికుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చిలో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : క్రిస్మస్ పండుగను పురష్కరించుకుని స్థానిక రెహబోతు ప్రార్థనా మందిరంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాస్టర్ డి.సాల్మన్, హర్షల ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు చీరెలను పంపిణీ చేశారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల, ఎస్.కొట్టాలపల్లె, నెమళ్లదిన్నె, సుద్దపల్లె, పెద్దముడియం, పాలూరు, కొండసుంకేసుల, జె.కొత్తపల్లె, గుండ్లకుంట గ్రామాలలోని క్రైస్తవ సోదరులు సీఎస్ఐ చర్చిలలో ప్రత్యేక పార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఆయా గ్రామాల చర్చిల ఆవరణలో ఆటపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : టౌన్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్లు వాక్య సందేశాన్ని భక్తులకు వినిపించారు. యేసు ప్రభువు లోకరక్షణ కోసం వచ్చాడన్నారు. అలాగే ఎస్పీజీ క్వార్టర్స్‌లోని సీఎస్ఐ చర్చి, ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న ఆర్‌సీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం క్రీస్తు జన్మకు సంబంధించిన కీర్తనలు పాడారు.

పెండ్లిమర్రిలో

పెండ్లిమర్రి : మండలంలోని పలు గ్రామాలల్లో క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వెల్లటూరు, చెన్నంరాజుపల్లె , పాతసంగటిపల్లె, చీమలపెంట, చౌటపల్లె, నందిమండలం, మాచునూరు, తుమ్మలూరు, దర్బార్‌పేట దళితవాడల్లోని పలు చర్చిలల్లో ఉదయాన్నె క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని కేక్‌లను కట్ చేసి ఆనందోత్సాహలతో పండుగను ఘనంగా నిర్వహించి బంధుమిత్రులతో విందు భోజనాలు ఏర్పాటు చేసుకొని ఆనందంగా గడిపారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : క్రిస్మస్ వేడుకలను వాడవాడలా బుధవారం ఘనంగా నిర్వహించారు.అన్ని చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు.ఉదయమే చర్చిలలో పాస్టర్లు భక్తులకు సందేశాలను వినిపించారు.ఏసు క్రీస్తు జననం,ఆయన జీవిత విధానాలను పాస్టర్లు బోధించారు.చర్చిల ప్రాంగణంలో ఆటలపోటీలు నిర్వహించారు.చర్చిలలో కేకులు కట్‌చేసి ఆనందంతో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు.



కమలాపురంలో భక్తులకు సందేశం ఇస్తున్న సీఎస్ఐ చర్చి ఫాస్టర్

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. చింతకొమ్మదిన్నె, ఇప్పపెంట, కృష్ణాపురం, ఊటుకూరు తదితర ప్రాంతాల్లోని చర్చిలలో ఉదయాన్నే క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి, బంధుమిత్రులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాస్టర్లు వినిపించిన బైబిల్ సూక్తులను శ్రద్ధగా ఆలకించి తమ ఇష్ట దైవాన్ని ప్రార్థించుకున్నారు. బంధుమిత్రులకు కేకులు పంచుకుని, విందు భోజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చిలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని మల్లేల, బూచుపల్లె, భద్రంపల్లె, ఇనగలూరు, అగడూరు, సంతకొవ్వూరు, ఎస్.చెర్లోపల్లె, గుండ్లమడుగు, మడూరు గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు, పాయసంపల్లె, కొమ్మద్ది, వెల్దుర్తి, వీరపునాయునిపల్లె, అడవిచెర్లోపల్లె, బుసిరెడ్డిపల్లె, ఎస్.పాలగిరి, గంగిరెడ్డిపల్లె, అనిమెల, తంగెడుపల్లె, యు.రాజుపాలెం తదతర గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉరుటూరు గ్రామంలో వివిధ ఆటలపోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి భహుమతులు అందించారు.

వేములలో..

వేముల : మండల వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ పండుగ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వేముల, ఎద్దులయేనే, వేల్పుల, గొల్లలగూడూరు, గొందిపల్లె, అమ్మయ్యగారిపల్లె గ్రామాల్లోని చర్చిలలో క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు సంతోషాల మధ్య జరుపుకున్నారు. ఆయా గ్రామాల చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే క్రైస్తవ సోదరులు చర్చిలలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలను నిర్వహించుకున్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలో క్రిస్మస్ పండుగ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. లింగాల బేతేలు చర్చిలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఫాస్టర్ క్రిష్టఫర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పెద్దకుడాల, చిన్నకుడాల, ఇప్పట్ల, బోనాల, పార్నపల్లె, కోమన్నూతల తదితర గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.



పులివెందులలో ప్రత్యేక ప్రార్థనలలో క్రైస్తవులు



వేంపల్లెలో ప్రత్యేక ప్రార్థనలలో క్రైస్తవులు



సింహాద్రిపురంలోని రెహబోతు ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



వేములలో విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చి



వీఎన్‌పల్లెలో ఏర్పాటు చేసిన క్రీస్తు జన్మించిన పశువులపాక



జమ్మలమడుగులో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు



పెద్దపసుపుల గ్రామంలో పార్థనలు చేస్తున్న క్రైస్తవులు

తాతిరెడ్డిపల్లెలో జగన్ కోసం జనం



వైఎస్సార్‌సీపీ జెండాలు చేతబట్టిన చిన్నారులు



వైఎస్ జగన్‌తో సెల్ఫీ దిగుతున్న జనం

లింగాల : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం తాతిరెడ్డిపల్లెలోని కోదండ రామాలయంలో శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో పులివెందుల క్రిస్మస్ సందర్భంగా సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు ముగించుకుని తాతిరెడ్డిపల్లె గ్రామానికి బయలుదేరారు. ఉదయం 11 గంటలకు తాతిరెడ్డిపల్లెకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరుకోవాల్సి ఉండగా.. అడుగడుగునా వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, ప్రజలు తండోప తండాలుగా తరలి వచ్చారు. దారి పొడవునా ఇప్పట్ల, తేర్నాంపల్లె, అక్కులగారిపల్లె, చిన్నకుడాల, పెద్దకుడాల, రామన్నూతనపల్లె, లింగాల, బోనాల, లోపట్నూతల, కర్ణపాపాయపల్లె, వెలిదండ్ల ప్రాంతాలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు, ఆయనతో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు భారీగా అభిమానులు తరలివచ్చారు. దీంతో ఆయన సాయంత్రం 4.30 గంటలకు తాతిరెడ్డిపల్లె గ్రామానికి చేరుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక ఆలస్యమైనా అభిమానులు ఆయన రాక కోసం అలుపెరగక నిరీక్షించారు. చిన్నపిల్లలు సైతం జగన్ మామయ్య అంటూ వైఎస్సార్ సీపీ జెండాలతో స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాతిరెడ్డిపల్లెలో వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆయన దేవతామూర్తులకు పట్టు వస్త్రాలను అందజేశారు. వేద పండితులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సత్కరించి ఆశీర్వాదాలను అందజేశారు. కార్యక్రమంలో తాతిరెడ్డిపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పుల్లారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ యర్రావుల పుష్ప, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పులివెందుల రూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు మద్దతుగా తలపెట్టిన ×కరెంట్ చార్జీల పెంపుపై వైఎస్సార్సీపీ పోరుబాట్ట కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పార్టీ వర్గాలు తెలిపారు. బుధవారం విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ పోరుబాటు కార్యక్రమం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 27వ తేదీన శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక పాత ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి పాత ఆర్టీసీ బస్‌స్టాండ్ మీదుగా ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎలక్ట్రికల్ డివిజనల్ అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు పాల్గొంటారని, ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, చైర్మన్లు, మాజీ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మండలాల నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, మాజీ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగపు నాయకులు, మహిళలు, బూత్ కమిటీ కన్వీనర్లు, కుల సంఘాల నాయకులు, వ్యాపార సంఘాల నాయకులు, వైఎస్ కుటుంబ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు.

అదే ఉత్సాహం.. అదే జోరు



సెల్‌ఫోన్లలో మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటో తీసుకుంటున్న ప్రజలు



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో సెల్ఫీ తీసుకుంటున్న ముస్లిం సోదరులు

పులివెందుల రూరల్ : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండవ రోజు బుధవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా పులివెందుల పట్టణంలోని స్థానిక సీఎస్ఐ చర్చి ఆవరణానికి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనా కూటమిలో పాల్గొన్నారు. ప్రార్థనా అనంతరం ప్రజలను కలిసేందుకు బయటకు రావడంతో సీఎం సీఎం అంటూ నినాదాలతో హోరెత్తించారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎంత ఉత్సాహాన్ని చూపించారో.. అంతే ఉత్సాహంతో, అదే జోరుతో ప్రజలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసేందుకు చర్చి ఆవరణలోకి భారీగా తరలివచ్చారు. ప్రజలు, మహిళలు ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. ప్రజలందరూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రింగ్ రోడ్డు సమీపంలోని కోతి సమాధి వద్ద పులివెందుల, కడప, అనంతపురం ప్రాంతాలకు చెందిన దూదేకుల సంఘం నాయకులు, రాష్ట్ర నూర్‌బాషా సంఘ అధ్యక్షుడు రసూల్‌లు మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసి పుష్పగుచ్చాలు అందించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు వైఎస్ జగన్‌ను కలిసి వారి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలను సమర్పించారు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



శ్రీ సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఆలయంలో ప్రతిష్ఠింపజేసిన శ్రీసీతారామ,లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలు



బండలాగుడు పోటీలలో వృషభరాజములు

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లెలో బుధవారం నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ఆరోహణ కార్యక్రమాలు బ్రహ్మశ్రీ పంచాంగం రామ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం శ్రీసీతారాముల కల్యాణం కన్నుల పండువలా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. మహిళల కోలాటాలు అలరించాయి. విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన భక్తులను అలరింపజేసింది.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు

పోటీలలో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.70వేలు, రెండవ బహుమతి రూ.50వేలు, మూడవ బహుమతి రూ.30వేలు, నాల్గవ బహుమతి రూ.20వేలు, 5వ బహుమతి రూ.10వేల నగదును ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలి



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు కరెంట్ షాక్ ఇస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఈ నెల 27న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన పోరుబాటకు మద్దతుగా భారీగా తరలిరావాలని ప్రజలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు పెంచబోమంటూ ఉపన్యాసాలిచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.15 వేల కోట్లు విద్యుత్ భారం మోపారని మండిపడ్డారు. ప్రభుత్వ చర్యలకు నిరసిస్తూ శుక్రవారం ఉదయం చేపడుతున్న పోరుబాటకు ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై పోరాట పోస్టర్లు విడుదల

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన చార్జీలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ చేపట్టబోయే నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, పట్టణ నాయకుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి పోస్టర్లను విడుదల చేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ఈ నిరసన కార్యక్రమాన్ని ఈనెల 27వతేదీ శుక్రవారం నారాపురస్వామి దేవాలయం సమీపంలో ఉన్న సాయిరాం థియేటర్ వద్దనుంచి కరెంటు ఆఫీసు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేస్తారన్నారు. కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ధన్నవాడ మహేశ్వరరెడ్డి, ముల్లాజానీ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



క్రిస్మస్ క్లాజ్ తాతతో నృత్యం చేస్తున్న చిన్నారులు



వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని శిల్పారామం, వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. శిల్పారామ ఏఓ సుధాకర్ ఆధ్వర్యంలో రామాంజి జ్యువెలర్స్, ఎంజెల్ ఫ్యాషన్, యాస్ టాటూ స్టూడియో, మెన్స్ బ్రాండ్స్, విజయవాడ ఎక్సలెంట్ ఇన్‌స్టిట్యూట్ నాగార్జున ఇంగ్లీషు మీడియం పాఠశాలల ఆధ్వర్యంలో డ్యాన్స్ మాస్టర్లు, చిన్నారులచే క్రిస్మస్ పాటలకు, సినిమా పాటలకు నృత్యాలు చేశారు. క్రిస్మస్ పండుగ కావడంతో సందర్శకుల తాకిడికి శిల్పారామం, వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో నిండుగా దర్శనమిచ్చాయి. అక్కడ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలకు మంచి ఆదరణ లభించింది.